RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 476 | 23 సెప్టెంబర్ బుధవారం 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# జూరాలకు నీళ్లివ్వండి..

## కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్





ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు.

జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు.అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు.జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

## హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం..

### అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, మల్కాజిగిరి, బోయిన్‌పల్లి, అంబర్‌పేట, కోఠి, లక్డీకాపూల్ వంటి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు భారీగా చేరడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా షేక్‌పేట పరిసర ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం సహా ఎనిమిది జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేయగా, మరో 20 జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేసింది.భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. సహాయక బృందాలు, కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## 'సర్' ప్రక్రియ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారు

### : సీపీఐ నారాయణ



ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్) పేరుతో చేపడుతున్న వింత, వికృత చర్యలు ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడేలా లేవని, విజ్ఞతలేని తీరుతో ఓటర్లను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ ఘాటుగా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న వైఖరి 'ఎద్దు ఈనిందంటే దూడను గాట్లో కట్టేయమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు, తప్పులు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో సరిదిద్దాలే తప్ప, దేశ మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ, ప్రస్తుత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి అత్యున్నత ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేయడం ఏ రకమైన ప్రక్షాళన అని ఆయన నిలదీశారు.పేర్లలో చిన్నపాటి స్పెల్లింగ్ పొరపాట్లు, వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడం వంటి అత్యంత సహజమైన అంశాలను కూడా పెద్ద సమస్యలుగా చిత్రీకరించడం, తాతముత్తాతల పుట్టిన తేదీలను వెతకాలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం విడ్డూరంగా ఉందని నారాయణ మండిపడ్డారు. దేశంలో ఉన్న కోట్లాది మంది ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, రాజ్యాంగబద్ధమైన నిష్పక్షపాతంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయం నడిపించే ఒక 'సురభి నాటకం'లో స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ అపవిత్రమైన పావుగా మారకూడదని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

## ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు,

### అత్యాచారాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది

### : రేవంత్ రెడ్డి



తెలంగాణ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలు, సంక్షేమ పథకాల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, తమ ప్రభుత్వం దళితులు, ఆదివాసీలు, గిరిజనుల సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. పేద ప్రజలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల పట్టాలు అందించిన ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే తమ ప్రజా పాలన కొనసాగుతోందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో 31 శాతం దళితులకు, 17 శాతం ఎస్టీలకు మంజూరు చేసి సంక్షేమంలో పెద్దపీట వేశామని వెల్లడించారు.అట్టడుగు వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న పలు విప్లవాత్మక చర్యలను సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఉదయం పూట పౌష్టికాహార బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, అలాగే 3 కోట్ల 48 లక్షల మంది ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తూ పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనాన్ని చేరవేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే దాడులు, అత్యాచార ఘటనలపై ప్రభుత్వం అత్యంత కఠినంగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. బాధితులకు అందాల్సిన నష్టపరిహార నిధులను బడ్జెట్ అడ్డంకులు లేకుండా నేరుగా 'గ్రీన్ ఛానెల్' ద్వారా తక్షణమే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యా వికాసమే పేదరికాన్ని నిర్మూలిస్తుందని, అందుకే పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించాలని, రాజకీయాలకు అతీతంగా ఈ వర్గాల పురోగతికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## 'ఇరాన్‌ను నాశనం చేసేయాలా?'

### .. ఐరాస వేదికగా ట్రంప్ సంచలన హెచ్చరిక



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి తీవ్ర హెచ్చరికలు చేశారు. తమతో ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేసే అవకాశం ఉందంటూ వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో మంగళవారం ప్రసంగించిన ట్రంప్.. ఇరాన్‌కు రెండు మార్గాలే ఉన్నాయని అన్నారు. అమెరికాతో ఒప్పందం చేసుకుని దేశాన్ని తిరిగి నిర్మించుకోవడం లేదా మరిన్ని సైనిక చర్యలను ఎదుర్కోవడమని పేర్కొన్నారు."నేను ఇస్లామిక్ రిపబ్లిక్‌ను త్వరగా నాశనం చేయాలా? వారికి మళ్లీ ప్రాణాలతో బయటపడే అవకాశం లేకుండా చేయాలా?" అని ట్రంప్ ప్రశ్నించారు. అయితే అమెరికా మధ్యంతర ఎన్నికలు ముగిసిన తర్వాత ఇరాన్‌తో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్ కూడా అమెరికా ఎన్నికల ఫలితాల కోసం వేచి చూస్తోందని చెప్పారు.ఇరాన్‌కు అణ్వాయుధం దక్కకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ వాణిజ్య నౌకలపై దాడులు ఆపే వరకు, అణు కార్యక్రమాన్ని విడిచిపెట్టే వరకు, ఉగ్రవాదానికి మద్దతు నిలిపే వరకు ఆ దేశాన్ని పూర్తిగా ఆర్థికంగా ఒంటరిగా చేయాలని ఇతర దేశాలను కోరారు.ఇరాన్‌తో జరిగిన ఘర్షణల్లో తమ సైనిక చర్యలు ఆ దేశ నౌకాదళం, వైమానిక దళం, రాడార్ వ్యవస్థలు, క్షిపణులు, డ్రోన్ల తయారీ సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని ట్రంప్ పేర్కొన్నారు. అలాగే అమెరికా వద్ద ఆయుధాల కొరత లేదని చెప్పారు. కొత్తగా 18 ఆయుధాల తయారీ కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.గాజా యుద్ధంపైనా ట్రంప్ మాట్లాడారు. యుద్ధాన్ని ముగించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, బందీల విడుదలకు కృషి చేసిందని చెప్పారు. తన 20 పాయింట్ల గాజా శాంతి ప్రణాళికకు ఐరాస భద్రతా మండలి మద్దతు తెలిపిందని పేర్కొన్నారు.ఉక్రెయిన్-రష్యా యుద్ధంపైనా ట్రంప్ స్పందించారు. ఇరు దేశాల నేతలతో అమెరికా సన్నిహితంగా చర్చలు జరుపుతోందని.. ఈ యుద్ధాన్ని ముగించేందుకు ఒప్పందం కుదురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనా విమర్శలు చేసిన ట్రంప్.. కృత్రిమ మేధ నియంత్రణకు సంబంధించిన అంతర్జాతీయ ప్రయత్నాలను కూడా వ్యతిరేకించారు.

## 2026 డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో ఉంటా..

### జైలుకెళ్లేందుకు సిద్ధం : షేక్ హసీనా



బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. 2026 డిసెంబర్ నాటికి తాను తప్పకుండా స్వదేశానికి తిరిగి వెళ్తానని ఆమె స్పష్టం చేశారు. తాను ఎప్పుడు వెళతాననే దానికంటే, ఏ విధంగా వెళతాననేదే అత్యంత ప్రధానమని ఆమె వ్యాఖ్యానించారు. ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా ఈ విషయాలను వెల్లడించారు. తన పునరాగమనం శాంతియుత మార్గంలో, చట్టబద్ధంగానే ఉండాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.2025 నవంబర్‌లో బంగ్లాదేశ్ ట్రిబ్యునల్ తనకు మరణశిక్ష విధించడాన్ని హసీనా తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, అన్యాయమైన తీర్పు అని ఆమె ఆరోపించారు. తన నిష్క్రమణ అనంతరం కొలువుదీరిన ప్రస్తుత ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా, తనపై జరుగుతున్న విచారణను ఒక ప్రహసనంగా ఆమె అభివర్ణించారు. తన రాజకీయ పోరాటంలో భాగంగా జైలుకు వెళ్లేందుకైనా తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా ఆమె తేల్చిచెప్పారు.ప్రస్తుతం రాజకీయ కార్యకలాపాలపై నిషేధం ఎదుర్కొంటున్న తన 'అవామీ లీగ్' పార్టీని పునర్నిర్మించడం, పార్టీ శ్రేణులతో సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తానని హసీనా వివరించారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద, తీవ్రవాద శక్తుల నుంచి ముప్పు పొంచి ఉందని, ఇది కేవలం ఆ దేశ అంతర్గత సమస్య మాత్రమే కాదని, ఒక తీవ్రమైన ప్రాంతీయ ముప్పు అని ఆమె హెచ్చరించారు.అయితే, తన పునరాగమన ప్రణాళికలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా ఖరారు కాలేదని ఆమె వెల్లడించారు. ఈ విషయంపై బంగ్లాదేశ్ లేదా భారత ప్రభుత్వాలతో తాను ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక లేదా అనధికారిక చర్చలు జరపలేదని హసీనా స్పష్టం చేశారు.

# ఆయిల్‌పామ్ రైతులకు అధికారుల సూచనలు

## - సాగులో సమస్యలు.. పంట సంరక్షణపై అవగాహన

**గీసుగొండ, సెప్టెంబర్ 21 హైదరాబాద్ ఎస్టేట్:**



గీసుగొండ మండలంలోని ఆయిల్‌పామ్ రైతుల సమావేశం సోమవారం కొనయమాకుల రైతు వేదికలో జరిగింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు హాజరై ఆయిల్‌పామ్ సాగులో ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగు పద్ధతులపై జిల్లా ఉద్యానవన అధికారి ఆర్.శ్రీనివాసరావు రైతులకు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం జిల్లా కమిటీ అధ్యక్షుడు నంద్యాల కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు చాడ కొమరారెడ్డి ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొట్ర రఘుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బండి రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వాడికారి తిరుపతి, సహాయ కార్యదర్శిగా చాడ సంజీవరెడ్డి, కోశాధికారిగా బాసాని శివరెడ్డి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కొత్త కుమారస్వామి, పుల్లూరి మాధవరెడ్డి, అమర్‌సింగ్, చింతల్ కుమార్‌స్వామి, చల్లా దేవేందర్‌రెడ్డి, పులి సూరయ్య, ఎర్రబంటి నర్సింగరావు, పోలీస్ అనిల్ ఎన్నికయ్యారు. సమావేశంలో మండలంలోని పలువురు ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యపై ప్రశ్నిస్తే అరెస్టులా?

## - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టుపై కనుకుంట్ల రంజిత్‌కుమార్ ఖండన

**వరంగల్, సెప్టెంబర్ 22, హైదరాబాద్ ఎస్టేట్:**



జూరాల ప్రాజెక్టు పరిధిలో సాగునీరు అందక పంటలు ఎండిపోతూ ఇబ్బందులు పడుతున్న రైతులకు మద్దతుగా వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావును జడ్చర్ల వద్ద అడ్డుకుని అరెస్టు చేయడాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల రంజిత్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలను తెలుసుకుని వారికి అండగా నిలిచేందుకు వెళ్తున్న విపక్ష నాయకులను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. రైతుల సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణిచివేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా విధానంగా కనిపిస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇటువంటి చర్యలను విడనాడి, జూరాల పరిధిలో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న రైతులకు తక్షణమే నీరు అందించి ఆదుకోవాలని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు.

# కులగణన కచ్చితంగా చేపట్టాలి

## - జనగణనతోపాటే కులాల వారీగా వివరాలు సేకరించాలి..

## - బీసీల హక్కుల కోసం పార్లమెంటులో పోరాడతాం : ఎంపీ వద్దిరాజు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21, హైదరాబాద్ ఎస్టేట్:**

జనాభా లెక్కల సేకరణ సందర్భంగా కులగణనను కూడా కచ్చితంగా చేపట్టాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. బీసీల న్యాయమైన హక్కుల సాధన కోసం పార్లమెంటులో, బయట తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం, బీసీ పొలిటికల్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం గన్‌పార్క్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రవిచంద్ర మాట్లాడుతూ.. కులగణన ద్వారా బీసీల జనాభా, సామాజిక పరిస్థితులకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. కులగణన కోసం జనాభా లెక్కల సేకరణలో ప్రత్యేక కాలమ్, క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని కోరారు. బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడంతోపాటు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వీ.శ్రీనివాస్‌గౌడ్, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫోరం చైర్మన్ బాలరాజ్‌గౌడ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు యాదయ్యగౌడ్ తదితరులతో పాటు వందలాది మంది పాల్గొన్నారు.




# మిత్రుడి కుటుంబానికి అండగా తోటి మిత్రులు

## - మృతి చెందిన కిషోర్‌బాబు కుమార్తె భవిష్యత్తుకు రూ.3.04 లక్షల ఆర్థిక భరోసా



**హనుమకొండ, సెప్టెంబర్ 21 హైదరాబాద్ ఎస్టేట్:**

అనారోగ్యంతో మృతి చెందిన తమ తోటి మిత్రుడు కిషోర్‌బాబు కుటుంబానికి కాకతీయ యూనివర్సిటీలో కలిసి చదువుకున్న మిత్రులు అండగా నిలిచారు. కిషోర్‌బాబు కుమార్తె పేరుతో రూ.3,04,511ను పోస్టాఫీసులో జమ చేసి ఆమె భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించారు. మిత్రుడి మృతి విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు కలిసి ఈ మొత్తాన్ని సమకూర్చారు. తమతో చదువుకున్న మిత్రుడి కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేందర్, సుధాకర్, మహేష్, శివాజీ, రాజశేఖర్ తదితర తోటి మిత్రులు పాల్గొన్నారు.

# తమ్ముడిని కత్తితో పొడిచి హత్య.. అన్న అరెస్ట్

## - 24 గంటల్లో కేసు ఛేదన.. కత్తి, రక్తపు దుస్తులు స్వాధీనం

**గీసుగొండ, సెప్టెంబర్ 21 హైదరాబాద్ ఎస్టేట్:**

గరీబ్‌నగర్‌లో తమ్ముడు ఎలుబాక ప్రసాద్ (31)ను కత్తితో పొడిచి హత్య చేసిన కేసులో అతని అన్న ఎలుబాక ప్రవీణ్ (33)ను గీసుగొండ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 19న రాత్రి గరీబ్‌నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ప్రసాద్‌పై కత్తితో దాడి జరిగింది. ఛాతి, వీపు, భుజంపై తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డబ్బుల విషయంలో అన్నదమ్ముల మధ్య గతంలో గొడవలు జరిగిన నేపథ్యంలో ప్రవీణ్ తమ్ముడిపై కక్ష పెంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. తల్లి నైట్ డ్యూటీకి వెళ్లిన సమయంలో ఇంటికి వెళ్లి ప్రసాద్‌తో గొడవకు దిగి కత్తితో దాడి చేసినట్లు పేర్కొన్నారు. పెనుగులాటలో ప్రవీణ్ ఎడమ బొటనవేలుకు గాయమైందని, అనంతరం గీసుగొండలోని ఓ ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకుంటూ తమ్ముడిని కత్తితో పొడిచినట్లు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం అతడిని అదుపులోకి తీసుకుని, అతని సమాచారంతో ఇంటి సమీపంలోని పొదల్లో దాచిన కత్తి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించగా, స్వాధీనం చేసుకున్న వస్తువులను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఎస్ఐలు అనిల్‌కుమార్, కుమార్, కానిస్టేబుళ్లు అరవింద్, విజయ్, ప్రవీణ్, భాస్కర్, రజినీకుమార్‌లను ఏసీపీ మామునూరు ఎన్.వెంకటేష్ అభినందించారు.




# కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

## గాంధీ భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 21, హైదరాబాద్ ఎస్టేట్:**

తెలంగాణ తొలి తరం ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. బాపూజీ చిత్రపటానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని సైతం వదులుకుని జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జల్‌పల్లి డ్రైనేజీ సమస్యపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..

## కాలనీ నుంచే జోనల్, డిప్యూటీ కమిషనర్లతో ఫోన్ లో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశం!

**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి మహేశ్వరం**

మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రివర్యులు శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి గారు ఈరోజు జల్‌పల్లి డివిజన్ 65 పరిధిలోని అద్నాన్ కాలనీ, సదత్ కాలనీ, సుధా కాలనీల్లో పర్యటించారు. స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ప్రజలు కాలనీల్లోని సమస్యలను అమ్మగారి దృష్టికి తీసుకెళ్లారు.

– అధికారులకు ఆదేశం: కాలనీల్లో డ్రైనేజీ అవుట్‌లెట్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను అమ్మగారు స్వయంగా పరిశీలించారు. పర్యటన స్థలం నుంచే జోనల్ కమిషనర్ మరియు డిప్యూటీ కమిషనర్ గారితో ఫోన్ లో మాట్లాడారు. ఈ సమస్యకు వెంటనే ఎస్టిమేషన్ (ఇన్‌స్ట్రూమెంట్) వేసి, వీలైనంత తొందరగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

– డ్రైనేజీ & రోడ్ల నిర్మాణం: అన్ని కాలనీలను కలుపుతూ ఒకే మెయిన్ అవుట్‌లెట్ నిర్మించేలా నిధులు సాంక్షన్ చేయిస్తానని, అలాగే ప్రజలు కోరిన విధంగా ఇంటర్నల్, మెయిన్ రోడ్డు సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు.

– ప్రభుత్వానికి విజ్ఞప్తి: జల్‌పల్లి మున్సిపాలిటీకి ఆదాయం తక్కువ, సమస్యలు ఎక్కువ. గతంలో కేసీఆర్ గారు రూ. 400 కోట్ల ప్రత్యేక నిధులతో ఇక్కడ వాటర్ పైప్‌లైన్లు, 2 రిజర్వాయర్లు, ఫారెస్ట్ వాకింగ్ ట్రాక్ నిర్మించి ఎంతో అభివృద్ధి చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్‌కు అతి దగ్గరగా ఉన్న జల్‌పల్లి అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం కూడా అత్యధికంగా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి గారు, యంజాల జనార్ధన్ గారు, ఎస్కే అఫ్జల్ గారు, పల్లపు శంకర్ గారు, సూరెడ్డి గోపాల్ రెడ్డి గారు, సైద్ పటేల్ గారు, వాసు బాబు గారు, పోలేమని నాగేష్ ముదిరాజు గారు, నర్సింగ్ గారు, నవాబ్పేట ఆంజనేయులు గారు, సయ్యద్ అబ్బాస్ గారు, మారుతి గారు, సయ్యద్ ఇద్రీస్ గారు, జిశాన్ గారు, గౌస్ గారు, వినయ్ రెడ్డి గారు, శంకర్ గారు, అద్నాన్ కాలనీ ప్రెసిడెంట్ అబ్రార్ గారు మరియు సొసైటీ సభ్యులు, కాలనీవాసులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# వినాయకుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)**



మండల పరిధిలోని సీతారామచంద్ర ఆలయంలోని గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పూజలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని కొనసాగించిన అర్చకులు ఆమంచి అనంతరామశాస్త్రి అనంతరం వారు మాట్లాడుతూ గణేశుని కృప మండల ప్రజలపై ఉండాలని ప్రతి ఒక్క కుటుంబం ఆయురారోగ్యాలతో ఉండాలని వారు తెలియజేశారు నవరాత్రులు పూజలు చేసి స్వామివారి నిమజ్జనం అత్యంత వైభోగంగా జరపాలని ఉత్సవ కమిటీ సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ప్రెస్ క్లబ్-2 వినతికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పందన



**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

చిట్యాల: చిట్యాల మండల ప్రెస్ క్లబ్–2 ఆధ్వర్యంలో సభ్యులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును కలిసి జర్నలిస్టుల సమస్యలను నేరుగా వివరించి వినతిపత్రం అందజేశారు.ప్రెస్ క్లబ్–2లోని అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు లేని జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే చిట్యాల ప్రెస్ క్లబ్–2కు సొంత భవనం నిర్మించుకునేందుకు స్థలం లేదా నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రెస్ క్లబ్–2 సభ్యుల వినతిపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సానుకూలంగా స్పందించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్–2 అధ్యక్షుడు శీలపాక ప్రణీత్ కుమార్, ప్రధాన కార్యదర్శి నేరెళ్ల ఓదెలు, ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు, కోశాధికారి పాముకుంట్ల చందర్, సహాయ కార్యదర్శి మ్యాదరి సునీల్, గొర్రె అనిల్, కార్యవర్గ సభ్యులు జన్నె యుగేందర్, కంచర్ల శ్రీను, మాసు కుమార్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

# గణనాధుని మండపం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి`ACPS రాష్ట్ర ఉపాధ్యక్షులు బురుగు నాగరాజు గుప్త



**మర్రిగూడ సెప్టెంబర్ 21 (హైద్రాబాద్ ఎస్టేట్)**

మర్రిగూడ మండల కేంద్రంలో విశ్వ జనని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో గణేష్ నవరాత్రి భాగంగా సోమవారం ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బురుగు నాగరాజు గుప్త బుజ్జి గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో తులలుగాలని ఆయన దేవుని కోరుకున్నారు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మూర్తి మిర్యాల రఘురాములు మంచుకొండ రాంబాబు మంచుకొండ కనకదుర్గ గజవెల్లి రవికుమార్ గజవెల్లి శిరీష గజవెల్లి చంద్రిక బూరుగు భారతమ్మ మరియు భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఎంజీఎం వద్ద ఉద్రిక్తత

## - పోలీసులతో తోపులాటలో వినయ్‌భాస్కర్‌కు గాయాలు





**వరంగల్, సెప్టెంబర్ 22, హైదరాబాద్ ఎస్టేట్:**

వరంగల్ ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సమస్యలు, మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ప్రధాన గేటు వద్ద పోలీసులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట జరగడంతో వినయ్‌భాస్కర్‌కు గాయాలయ్యాయి. అనంతరం ఆయనకు ఎంజీఎంలోనే వైద్యులు చికిత్స అందించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో వినయ్‌భాస్కర్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎంజీఎంలో ఇటీవల పైకప్పు పెచ్చులు ఊడిపడిన ఘటనల నేపథ్యంలో ఆసుపత్రి పరిస్థితులను పరిశీలించేందుకు వినయ్‌భాస్కర్ పార్టీ నాయకులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. అయితే ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగి, అనంతరం తోపులాట చోటుచేసుకుంది. ఈ పరిణామంపై ఆసుపత్రిలోని కొందరు రోగుల బంధువులు, మహిళలు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన వైద్యం, మందులు, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. చికిత్స అనంతరం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఎంజీఎంలో పేద రోగులకు నాణ్యమైన వైద్యం, భద్రతతో కూడిన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆసుపత్రిలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే తాను వచ్చినట్లు తెలిపారు. రోగుల ఇబ్బందుల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# ప్రధానినరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిరుపేద మహిళకు ఆర్థిక సహాయం,నిత్యావసరాలు పంపిణీ



మెదక్,సెప్టెంబర్22(హైద్రాబాద్ ఎస్టేట్):

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బాధితురాలికి ఆర్థిక సహాయం,బియ్యం,నిత్యావసరాలను పంపిణీ చేసినట్లు మెదక్ జిల్లా,హవేలీ ఘనపూర్ మండలం బ్యాతోల్ కు చెందిన ప్రముఖ సంఘ సేవకులు,బీజేపీ నాయకులు పిప్పిరి రవీందర్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర జన్మదినం సందర్భంగా ప్రతీ ఒక్కరూ నెల రోజుల పాటు పార్టీలకు అతీతంగా పేద వారికి సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు.అందరి ఆశీస్సులు,మన్ననలతో ప్రధాని నరేంద్ర మోదీ వంద సంవత్సరాల పాటు భగవంతుడు ఆయనకు ఆయుస్సును ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మెదక్ జిల్లా, చిన్నశంకరంపేట మండల పరిధిలోని దరిపల్లి గ్రామానికి చెందిన ఓ నిరుపేద మహిళ అనారోగ్యంతో మృతి చెందింది.మరణించిన మహిళ కడు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న విషయాన్ని గమనించి మంగళవారం రోజు దరిపల్లి గ్రామ సర్పంచ్ కు పోన్ ద్వారా సమాచారం అందించి మెదక్ జిల్లా సత్యసాయి సేవా సమితి మాజీ కన్వీనర్ వెంకట్ గౌడ్ తో కలిసి బాధిత మహిళకు నెలకు సరిపడా కిరాణా సామాగ్రి,పిల్లలకు బట్టలు అమ్మాయికి చీర రూ.4000/- ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. బాధిత మహిళకు మరింత సహాయం అందజేయాలని తమ మిత్ర బృందంకు తెలిపినట్లు ఆయన వెల్లడించారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా స్వరూప మారం

## జూకల్ పాఠశాల గణిత ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**



జూకల్: జూకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌మ్యాథమెటిక్స్‌గా సేవలందిస్తున్న శ్రీమతి స్వరూప మారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. గణిత బోధనలో వినూత్న పద్ధతులు అవలంబిస్తూ, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, విద్యా రంగానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆమెకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది.ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత చేతుల మీదుగా స్వరూప మారం ఘనంగా సన్మానం పొందారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోవడం పట్ల జూకల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గణితం అంటే కేవలం సంఖ్యలు, లెక్కలు మాత్రమే కాకుండా విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించే సాధనమని తన బోధన ద్వారా నిరూపిస్తున్న స్వరూప మారం, ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారని పలువురు అభినందించారు.జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై అవార్డు అందుకున్న స్వరూప మారంకు జూకల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలో జూకల్ విద్యార్థి ప్రథమ స్థానం

**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**



జూకల్, సెప్టెంబర్ 22: జిల్లా యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలం జూకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కౌటం అభిలాష్ ప్రథమ స్థానంలో నిలిచాడు.ఈ సందర్భంగా జూకల్ గ్రామ సర్పంచ్ ఎలగొండ సంధ్యతిరుపతి దంపతులు, ఉప సర్పంచ్ అమీర్ సోహెల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కోరుకొప్పుల కావ్య అభిలాష్‌ను హృదయపూర్వకంగా అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు.విద్యార్థిని పోటీలకు సిద్ధం చేసిన గైడ్ టీచర్లు మహమ్మద్ రఫీ, ఉమాదేవిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిగాని కృష్ణ అభినందించారు. అభిలాష్ రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ప్రతిభ కనబరిచి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాధిక రాణి, మమత, రూపశ్రీ, రవీందర్, శ్రీనివాస్, యోగానంద చారి, రామకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొని విద్యార్థి అభిలాష్‌ను అభినందించారు.ా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన అభిలాష్‌కు పాఠశాల తరపున, హృదయపూర్వక అభినందనలు.ా

# పత్తికి తెగుళ్ల ముప్పు

## - తలమాడు తెగులు, గులాబీ పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

**గీసుకొండ, సెప్టెంబర్ 22, హైదరాబాద్ ఎస్టేట్:**



ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితుల్లో పత్తి పంటకు తలమాడు తెగులు, గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బి.వి. రాజకుమార్, మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు సూచించారు. గీసుకొండ మండలం మనుగొండలో రైతు చాపర్తి రంజిత్‌కు చెందిన పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట ఆరోగ్యాన్ని పరిశీలించడంతో పాటు తెగుళ్లు, పురుగుల నివారణపై రైతులకు సూచనలు చేశారు. ఆగస్టులో కురిసిన వర్షాలతో పొలాల గట్లు, చుట్టుపక్కల పెరిగిన కలుపు మొక్కల కారణంగా ప్రస్తుతం తామర పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్త రాజకుమార్ తెలిపారు. తామర పురుగుల ద్వారా టొబాకో స్ట్రీక్ వైరస్ వ్యాప్తి చెంది తలమాడు తెగులు సోకుతుందని, దీని వల్ల పత్తి దిగుబడి దాదాపు 62 శాతం వరకు తగ్గే ప్రమాదం ఉందని వివరించారు. తెగులు సోకిన మొక్కల్లో లేత ఆకులు రంగు మారి కుచించుకుపోవడం, ఎదుగుదల నిలిచిపోవడం, ఆకులు నల్లబడి ఎండిపోవడం, కొమ్మలు, పూమొగ్గలు, గూడలు దెబ్బతిని రాలిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. చేనులో, గట్లపై వయ్యారిభామ, తుత్తురుబెండ వంటి కలుపు మొక్కలను పూతకు రాకముందే తొలగించి నాశనం చేయాలని సూచించారు. తామర పురుగులను ఆకర్షించి నియంత్రించేందుకు ఎకరాకు 20 నీలిరంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని, పంట తొలి దశలో లీటరు నీటికి 5 మి.లీ. వేపనూనె కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తామర పురుగుల ఉధృతి అధికంగా ఉంటే ఫిప్రోనిల్ 2 మి.లీ., ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ., ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా డైఫెంథియూరాన్ 1.25 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పూత దశ నుంచి కాయ నిండు దశ వరకు గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ హరి ప్రసాద్ బాబు తెలిపారు. ఈ పురుగు ఆశించినప్పుడు పూలు 'గుడ్డి పూలు'గా మారుతాయని, వాటిని గుర్తించి ఏరివేసి నాశనం చేయాలని సూచించారు. ప్రారంభ దశలో లీటరు నీటికి 5 మి.లీ. వేపనూనె (1500 పీపీఎం) కలిపి పిచికారీ చేయాలని, పురుగు ఉధృతి అధికంగా ఉంటే లీటరు నీటికి 1.5 గ్రాముల థయోడికార్బ్ లేదా 2 మి.లీ. ప్రొఫెనోఫాస్‌ను నిర్ణీత మోతాదులో వినియోగించాలని తెలిపారు. ఈ క్షేత్ర పరిశీలనలో టీఆర్‌వీకే శాస్త్రవేత్త, సమన్వయకర్త బి.వి. రాజకుమార్, మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల రుద్ర ప్రసాద్, ఏలుకుర్తి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి పి. స్మితతో పాటు మనుగొండ, చంద్రయ్యపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# అండర్-17 క్రికెట్ సెలక్షన్స్‌లో తవక్కల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**హైదరాబాద్ ఎస్టేట్ 22 సెప్టెంబర్**

మంచిర్యాల జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (యస్ జి ఎఫ్) డిస్ట్రిక్ట్ సెక్రటరీ యాకూబ్ మాన్, డిప్యూటీ మేయర్ చల్లా రమ్య అధ్యక్షతన అండర్-17 క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించారు. మంచిర్యాలలోని ట్రినిటీ స్కూల్‌లో నిర్వహించిన ఈ సెలక్షన్స్‌లో తవక్కల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినీ విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తవక్కల్ స్కూల్ లోకల్ గ్రూప్స్ ఆఫ్ స్కూల్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ. విద్యార్థులు క్రికెట్‌లో ఎంతో ఆసక్తి, ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. క్రమం తప్పకుండా శిక్షణ తీసుకుంటూ సెలక్షన్స్‌లో తమ సత్తా చాటడంతో నలుగురు విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. తవక్కల్ స్కూల్ ప్రిన్సిపల్ పావని మాట్లాడుతూ.. పాఠ్యాంశాలతో పాటు క్రీడలకు కూడా తమ పాఠశాలలో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అండర్-17 క్రికెట్ సెలక్షన్స్‌లో నలుగురు విద్యార్థులు ఎంపిక కావడం పాఠశాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు గర్వకారణమన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న కోచ్ జంగంపల్లి రాజేష్ కుమార్ ను అభినందించారు. సెలెక్ట్ అయిన విద్యార్థులను తవక్కల్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, తవక్కల్ స్కూల్ మెయిన్ బ్రాంచ్




ప్రిన్సిపల్ పావని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# దేవాపూర్‌లో ఘనంగా 11వ ఆయుర్వేద దినోత్సవ వేడుకలు

## పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు

**హైదరాబాద్ ఎస్టేట్ 22 సెప్టెంబర్**

భారతీయ వైద్య సంప్రదాయమైన ఆయుర్వేదం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ మంచిర్యాల జిల్లా దేవాపూర్ గ్రామంలో 11వ ఆయుర్వేద దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా స్థానిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయుర్వేదం, యోగా, ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణలో కీలక ఆయుర్వేదందె అన్నారు. అధికారులు, వైద్య సిబ్బంది మాట్లాడుతూ ఆయుర్వేదం భారతీయ వైద్య విజ్ఞానంలో విశిష్ట స్థానం కలిగి ఉందని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణతో పాటు వ్యాధుల నివారణలో ఆయుర్వేదం, యోగా, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన జీవనశైలి ఎంతో ముఖ్యమని వివరించారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని సూచించారు. ఈ నెల 23న ప్రత్యేక ఆయుర్వేద సెమినార్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు, సంబంధిత వర్గాల వారు అధిక సంఖ్యలో పాల్గొని సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమేశ్ రాథోర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత, సర్పంచ్ సీడం రామదాసు, వార్డు సభ్యులు, మెడికల్ ఆఫీసర్ డా. రామకృష్ణ, ఫార్మసిస్ట్ రమాదేవి, యోగా ఇన్‌స్ట్రక్టర్ జి. గీతాదేవి, వీఎల్ఓ ఆమని, ఆశా వర్కర్ సునీత, జీపీఓ శశికుమార్‌తో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

23న ఆయుర్వేద సెమినార్

ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా ఈ నెల 23న ప్రత్యేక ఆయుర్వేద సెమినార్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు, సంబంధిత వర్గాల వారు అధిక సంఖ్యలో పాల్గొని





సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు.

# బాలాపూర్ గడ్డ నుండి రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన ఆవుల యాదయ్య

## మహేశ్వరం మండల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఆవుల యాదయ్య

**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 21:)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలానికి చెందిన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి నియోజకవర్గంలో ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఎంతో కృషి చేయడం జరిగిందని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఆవుల యాదయ్య అన్నారు. పారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గంలో పాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ మరింత బసవేతం అవుతుందని ఆకాంక్షించారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి జిల్లా అధ్యక్ష పదవి దాకా వెళ్లిన సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి కి శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగిందని మహేశ్వరం మండల్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల యాదయ్య తెలియజేశారు



# పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన

## - అర్హులైన పట్టభద్రులు ఫారం18తో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి

**గీసుకొండ, సెప్టెంబర్ 22, హైదరాబాద్ ఎస్టేట్:**

వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదుపై గీసుకొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధాడి శివ పట్టభద్రులకు అవగాహన కల్పించారు. 01 నవంబర్ 2022 నాటికి లేదా అంతకుముందు డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల ఓటరుగా నమోదుకు అర్హులని తెలిపారు. డిగ్రీ, బీఈ, బీటెక్ లేదా ఇతర పట్టభద్రుల విద్యార్హత కలిగి, నియోజకవర్గ పరిధిలో నివసించే వారు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుకు డిగ్రీ లేదా తాత్కాలిక పట్టా ధ్రువపత్రం, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, మొబైల్ నంబర్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పాత ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు జాబితా స్థానంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఫారం18 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ధాడి శివ సూచించారు. అర్హత ఉన్న పట్టభద్రులు ఓటరు నమోదుకు సంబంధించిన వివరాలను తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



# ఘనంగా చిన్ని బొజ్జ గణపయ్యకు ముగింపు పూజలు.. భారీ అన్నదానం

ఉప్పుగూడ, సెప్టెంబర్ 22: ఉప్పుగూడలోని సరిత టెక్స్‌టైల్స్ షోరూమ్ వద్ద కొలువుదీరిన 'చిన్ని బొజ్జ గణపయ్య' ముగింపు పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. గుండ్లపల్లి చంద్రమోహన్, జి. సరిత, శ్రేయల ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న స్వామివారికి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూర్ణాహుతి, ముగింపు పూజలు నిర్వహించారు.

నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని షోరూమ్ ఎదుట భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఈ వితరణలో ఉప్పుగూడ, హనుమాన్ నగర్, దానయ్య నగర్, ఛత్రినాక, అంబికా నగర్, హనుమాన్ నగర్ ఫేజ్-2 తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అనంతరం రాత్రి 9 గంటలకు వివిధ రకాల పూలతో



నయనానందకరంగా అలంకరించిన ప్రత్యేక వాహనంలో స్వామివారి నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమైంది. బాజాభజంత్రీలు, చిన్నారుల కేరింతలు, "జై బోలో గణేష్ మహారాజ్ కీ జై", "గణపతి బప్పా మోరియా.. అగలే బరస్ తూ జల్దీ ఆ" నినాదాల మధ్య ఊరేగింపు కోలాహలంగా



సాగింది. జల్పల్లి చెరువుకు చేరుకుని గణనాథుడిని ఘనంగా నిమజ్జనం చేశారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గుండ్లపల్లి షణ్ముఖ్, కాలే అమర్‌నాథ్, కాలే స్రవంతి, కాలే వర్ధన్, కాలే వికాస్ వర్ధన్, కాలే వంశీక, కందడి అనిల్ కుమార్, ప్రవీణ్ కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం

## - మురళి గౌడ్,వెంకటేష్ గౌడ్

## కందుకూరు ఎక్స్ రోడ్ కళ్యాణ్ నగర్ లో సౌడపు శంకర్ గౌడ్ జ్ఞాపకార్ధకంగా అన్నప్రసాద కార్యక్రమం

**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 21:)**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు ఎక్స్ రోడ్ కళ్యాణ్ నగర్ లో సౌడపు శంకర్ గౌడ్ జ్ఞాపకార్థం అన్నప్రసాద కార్యక్రమం వారి కుమారులు మురళి గౌడ్ వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించినారు ఈ కార్యక్రమంలో కందుకూరు సర్పంచ్ సరికొండ పాండు. మాజీ పి ఎస్ సి సి చైర్మన్ సరికొండ మల్లేష్. బీసీ సెల్ అధ్యక్షులు సరికొండ జగన్ వార్డ్ సభ్యులు బర్కం మంజుల వెంకటేష్. రొట్టెల శ్రీలక్ష్మి కృష్ణ. కందడి నరసింహ. సునీత సుదర్శన్. తాళ్ల కార్తీక్. సిరిగిరి కవిత జంగా చారి. గాదె రవి. సీనియర్ నాయకులు జగన్ పాముల కృష్ణ. ఎగిడి కృష్ణ. పరమేష్. కృష్ణ. రఘు బాబు. నిరంజన్. రాజశేఖర్ రెడ్డి. నవతారం యూత్ అధ్యక్షులు తాళ్ల అఖిల్ తదితరులు పాల్గొన్నారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురళి గౌడ్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ..ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయి ఇంతకన్నా మానవత్వం, దైవత్వం మరెక్కడ లేదన్నారు.

# మహేశ్వరం పట్టణ కేంద్రంలో వినాయకుని పూజలో పాల్గొన్న కాకి ఈశ్వర్ ముదిరాజ్



**( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 21:)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో 8 వ వార్డు మరియు 10 వ వార్డు లో వినాయకుని పూజ లో పాల్గొన్న తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, మహేశ్వరం గ్రామపంచాయతీ 8 వ వార్డు సభ్యులు కాకి పరమేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం మహేశ్వరం గ్రామ ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం గ్రామ 10 వ వార్డ్ ఇన్చార్జ్ కాకి మల్లేష్ ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం మండల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నడికూడా రాకేష్ ముదిరాజ్,మహేశ్వరం గ్రామ పెద్దలు కాకి రామచంద్రయ్య ముదిరాజ్, కట్నం శ్రీశైలం, కటికల జగన్ ముదిరాజ్, గ్రామ యువకులు కాకి శ్రీను, కాకి రాజేష్, కాకి సుధాకర్, కట్నం రాఘవేందర్, టీ. దత్తేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన సర్పంచ్ దేవేందర్ నాయక్



**( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 20:)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం గంగారం గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. చిగిరింత పారిజాత నరసింహారెడ్డి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా.. శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఎంతో కృషి చేయడం జరిగిందని అన్నారు అలాగే నియోజకవర్గంలో పాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పారిజాత నర్సింహారెడ్డి నేతృత్వంలో.. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు ఈ యొక్క కార్యక్రమంలో...గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ ఉపసర్పంచ్ మహేందర్, వార్డ్ మెంబర్ రవి, ఏం దేవా, ఎం శ్రీనివాస్, ఏం రమేష్, పి జయరాం,ఎం నరేష్, హనుమతు, ఏం రాజా, ఏం నీల్య భాస్కర్, యాదయ్య, విజయ్, తదితులు పాల్గొన్నారు

# వినయ్ భాస్కర్‌పై దాడిని ఖండించిన రాజేష్

## - బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**వరంగల్, సెప్టెంబర్ 22, హైదరాబాద్ ఎస్టేట్:**



వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై పోలీసులు దాడి చేశారంటూ వచ్చిన ఘటనను బీఆర్ఎస్‌వీ విద్యార్థి విభాగం నాయకుడు కొరపల్లి రాజేష్ తీవ్రంగా ఖండించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులపై పోలీసులు దాడులకు పాల్పడటం సరికాదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని రాజేష్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
23 సెప్టెంబర్ బుధవారం 2026

# షాద్నగర్ ఎమ్మెల్యే ఎక్కడ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఎప్పటి వరకు

**- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సారు ... స్పందిస్తారా? - 60 ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులకు పట్టా పుస్తకం లేదు**

**- పెంజర్ల రైతుల గోస ఎవరు పట్టించుకోరా...? - షాద్ నగర్ ఎమ్మెల్యే ఎక్కడ? రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఎప్పటి వరకు?**

**- పెంజర్ల అర్హులైన రైతులందరికీ పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి - పట్టా పాస్ బుక్కులు రాకుండా ఎవరో అడ్డుపడుతున్నారో చెప్పాలి**

**- అధికారుల ఆలస్యం రైతుల్లో పలు అనుమానాలు - కలెక్టర్ కార్యాలయం ముందు మీడియాతో మాట్లాడిన రైతులు**

**హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 21**

ఇది ఒకటి రెండు ఏళ్ల సమస్య కాదు. 1960వ దశకం నుండి.. అంటే దాదాపు 65 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు ఇప్పటికీ పట్టాదార్ పాస్ పుస్తకాలు లేవు. ఇది రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండలం పెంజర్ల గ్రామ రైతుల దీనగాథ.

**అసలు సమస్య ఏంటి?**

గ్రామంలోని పాత సర్వే నంబర్లు ఏక్స్ 1 నుండి ఏక్స్ 17 కింద ఉన్న వ్యవసాయ ఇనాం భూములను తరతరాలుగా రైతులు సాగు చేస్తున్నారు.

**ప్రభుత్వమే ఒప్పుకుంది.. ఆదేశాలు కూడా ఇచ్చింది:**

ఈ విషయాన్ని గుర్తించిన సీసీఎల్ఏ వారే పాత సర్వే నంబర్లకు – కొత్త సర్వే నంబర్లు 238 నుండి 254 మరియు 256 నుండి 288 వరకు అనుసంధానం (కరెలేషన్ ) చేస్తూ, టి ఎం –33 దరఖాస్తులు స్వీకరించాలని లిలేఖ నం. సీఎంఆర్ఓ, 3282/2022, తేదీ 05.05.2023 ద్వారా జిల్లా కలెక్టర్ ని ఆదేశించారు.దాని ప్రకారం కొత్తూర్ ఎమ్మార్వో కూడా సేత్వార్ వివరాలను తన లాగిన్ లో లేఖ నం. బి /3034/2015, తేదీ 16.01.2025 ద్వారా నమోదు చేశారు. కొందరికి కొత్త ప్రొసీడింగ్స్ కూడా వచ్చాయి.

**మరి ఆగిపోయింది ఎక్కడ?**

అసలు కీలకమైన "ఎనబ్లె పర్మిషన్ "దగ్గరే అంతా ఆగిపోయింది. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఎనేబుల్ అనుమతి రాకపోవడంతో వందలాది మంది అర్హులైన రైతుల ఫైళ్లు పెండింగ్ లోనే ఉన్నాయి.

**అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నాం:**

1. సీసీఎల్ఏ ఆదేశాలు ఇచ్చి 2 ఏళ్లు, ఎమ్మార్వో డేటా ఎంట్రీ చేసి 8 నెలలు అవుతున్నా, కలెక్టర్ ఆఫీసులో ఫైల్ ఎందుకు కదలడం లేదు? రైతులు పాస్ పుస్తకం లేక రుణాలు రాక, రైతు భరోసా రాక, భూమిని అమ్ముకోలేక, బ్యాంకుల చుట్టూ తిరుగుతుంటే షాద్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఏం చేస్తున్నట్టు?ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చే నాయకులు, ఇప్పుడు రైతుల 60 ఏళ్ల సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదని రైతుల ప్రశ్నిస్తున్నారు.ఇది భూ వివాదం కాదు, రైతుల జీవన్మరణ సమస్య. సీసీఎల్ఏ క్లియరెన్స్ వచ్చిన తర్వాత కూడా కలెక్టర్ గారి ఎనేబుల్ కోసం ఎదురుచూడటం అంటే రైతుల సహనాన్ని పరీక్షించడమే.కాబట్టి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, పెండింగ్ ఫైళ్లకు ఎనేబుల్ అనుమతి ఇచ్చి, పెంజర్ల అర్హులైన రైతులందరికీ పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని

పెంజర్ల గ్రామ అర్హులైన గ్రామ రైతులు వేడుకుంటున్నారు. మా భూములపై బడా బాబుల కన్ను పడిందా ఎందుకు సంవత్సరాల గడుస్తున్న అధికారులు పనిచేయడం లేదని రైతుల ప్రశ్నిస్తున్నారు.



కొందరు పడ బాబులు కావాలని ఆ భూములు పట్టా పాసు బుక్కులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ మా భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి కోట్ల రూపాయలు దోచుకోవాలని కొందరు చూస్తున్నారని రైతులు ఆరోపించారు. ఎవరెన్ని చేసినా మా పోరాటం ఆగదని మా ప్రాణాలు పోయినా భూమిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రైతులు తెలిపారు.

# వరంగల్ ప్రాంత ప్రజలకు అధునాతన రోబోటిక్ యూరాలజీ, కిడ్నీ ట్రాన్స్ప్లాంట్ సేవలు అందుబాటులోకి డా. కౌశిక్ అమంచర్ల

**హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ**

వరంగల్ ప్రాంత ప్రజలకు అధునాతన యూరాలజీ చికిత్సలు, అత్యాధునిక రోబోటిక్ శస్త్రచికిత్స సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వచ్చాయని యశోద హాస్పిటల్స్, సోమాజిగూడకు చెందిన కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ యూరో–ఆంకాలజిస్ట్, ఆండ్రాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్ప్లాంట్ సర్జన్ డా. కౌశిక్ అమంచర్ల తెలిపారు. వరంగల్లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.

కిడ్నీ, ప్రోస్టేట్, మూత్రాశయం మరియు మూత్ర నాళాలకు సంబంధించిన సంక్లిష్ట సమస్యలకు ప్రత్యేక వైద్యం కోసం వరంగల్ ప్రాంతం నుంచి అనేక మంది రోగులు హైదరాబాద్కు వెళ్లాల్సి వస్తోందని డా. కౌశిక్ తెలిపారు. ఈ ప్రత్యేక కన్సల్టేషన్ కార్యక్రమం ద్వారా నిపుణుల వైద్య సలహాలను రోగులకు వారి ప్రాంతానికి దగ్గరగా అందించడం, సమగ్ర వైద్య పరీక్షలు చేయడం, ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన కల్పించడం మరియు తదుపరి ఫాలో–అప్ను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

కిడ్నీ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, మూత్రాశయ క్యాన్సర్, ప్రోస్టేట్ గ్రంథి పెరుగుదల (ధీూ౬), కిడ్నీ రాళ్లు, మూత్రం ఆపుకోలేకపోవడం, యూరెత్రల్ స్ట్రిక్చర్, పురుషుల వంధ్యత్వం, లైంగిక ఆరోగ్య సమస్యలు, పిల్లల యూరాలజీ సమస్యలు, అలాగే కిడ్నీ వైఫల్యానికి అవసరమైన కిడ్నీ మార్పిడి వంటి అనేక సమస్యలకు సమగ్ర చికిత్స అందిస్తున్నట్లు ఆయన వివరించారు.

రోబోటిక్ సర్జరీలో ఆధునిక సాంకేతికత

యూరాలజికల్ క్యాన్సర్ల చికిత్సలో రోబోటిక్ సర్జరీ కీలకమైన మార్పును తీసుకువచ్చిందని డా. కౌశిక్ తెలిపారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా అధిక ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స చేయడంతో పాటు మెరుగైన విజువలైజేషన్ లభిస్తుందని చెప్పారు.

కిడ్నీ ట్యూమర్ల విషయంలో రోబోటిక్ పార్టియల్ నెఫ్రెక్టమీ ద్వారా క్యాన్సర్ను తొలగిస్తూ, సాధ్యమైన సందర్భాల్లో కిడ్నీలోని ఆరోగ్యకరమైన భాగాన్ని సంరక్షించవచ్చని, తద్వారా దీర్ఘకాలిక కిడ్నీ పనితీరును కాపాడేందుకు సహాయపడుతుందని వివరించారు.

అదేవిధంగా, తగిన రోగులలో రోబోటిక్ రాడికల్ ప్రోస్టటెక్టమీ ద్వారా క్యాన్సర్ను సమర్థవంతంగా తొలగించడంతో పాటు, తక్కువ రక్తస్రావం, వేగవంతమైన కోలుకోవడం మరియు మెరుగైన ఫంక్షనల్ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు.

క్లిష్టమైన కిడ్నీ ట్రాన్స్ప్లాంట్లలో అనుభవం

కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలో ప్రతి కేసుకు ముందస్తు ప్రణాళిక ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా క్లిష్టమైన శరీర నిర్మాణ పరిస్థితులు ఉన్న దాతలు లేదా అధిక వయస్సు గల దాతల విషయంలో మరింత జాగ్రత్త అవసరమని డా. కౌశిక్ తెలిపారు.

యశోద హాస్పిటల్స్లో 81 ఏళ్ల మరియు 71 ఏళ్ల వయస్సు గల జీవించి ఉన్న దాతల నుంచి కిడ్నీలను సేకరించి విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్ప్లాంట్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. తగిన వైద్య పరీక్షలు, సమగ్ర మూల్యాంకనం మరియు




జాగ్రత్తగా ఎంపిక చేసిన సందర్భాల్లో వృద్ధ దాతలు కూడా సురక్షితంగా కిడ్నీ దానం చేయగలరని ఈ అనుభవాలు తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు.

ఇలాంటి క్లిష్టమైన ట్రాన్స్ప్లాంట్లకు సమగ్ర ప్రీ–ఆపరేటివ్ మూల్యాంకనం, ఖచ్చితమైన శస్త్రచికిత్సా నైపుణ్యం మరియు వివిధ విభాగాల వైద్య నిపుణుల సమన్వయం అవసరమని ఆయన వివరించారు.

యశోద హాస్పిటల్స్లో జీవించి ఉన్న దాతల నుంచి మరియు మృత దాతల నుంచి కిడ్నీ ట్రాన్స్ప్లాంట్లతో పాటు, క్లిష్టమైన వాస్క్యులర్ రీకన్స్ట్రక్షన్ వంటి సాంకేతికంగా సవాళ్లతో కూడిన శస్త్రచికిత్సలను కూడా అనుభవజ్ఞులైన ట్రాన్స్ప్లాంట్ వైద్యులు, అనస్థీషియాలజిస్టులు మరియు క్రిటికల్ కేర్ నిపుణుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేగవంతమైన రికవరీకి మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలు

మినిమల్లీ ఇన్వేసివ్ మరియు రోబోటిక్ శస్త్రచికిత్సా విధానాలు రోగుల రికవరీలో గణనీయమైన మార్పును తీసుకువచ్చాయని డా. కౌశిక్ తెలిపారు. వీటి ద్వారా శస్త్రచికిత్స అనంతర నొప్పి, రక్తస్రావం తగ్గడంతో పాటు, ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గి, రోగులు తమ సాధారణ జీవన విధానానికి త్వరగా తిరిగి వెళ్లేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

ఈ అవుట్రీచ్ కార్యక్రమం ద్వారా కేవలం వైద్య సలహాలను అందించడం మాత్రమే కాకుండా, యూరాలజికల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం కూడా ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.కిడ్నీ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్లను ప్రారంభ దశలో గుర్తిస్తే సమర్థవంతంగా చికిత్స చేయవచ్చని, అలాగే కిడ్నీ వైఫల్యం మరియు ఇతర యూరాలజికల్ సమస్యలకు సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచవచ్చని ఆయన పేర్కొన్నారు.

యశోద హాస్పిటల్స్ భారతదేశంలోని ప్రముఖ టెర్షియరీ కేర్ వైద్య సంస్థల్లో ఒకటిగా ఆధునిక వైద్య సేవలను అందిస్తోందని డా. కౌశిక్ తెలిపారు. యశోద హాస్పిటల్స్, సోమాజిగూడలో అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు అనుభవజ్ఞులైన మల్టీడిసిప్లినరీ వైద్య బృందాల సహకారంతో సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఈ మీడియా సమావేశానికి యశోద హాస్పిటల్స్, సోమాజిగూడకు చెందిన కార్పొరేట్ రిలేషన్స్ విభాగం ప్రతినిధులు హాజరయ్యారు.

## దుర్గా నగర్లో ఘనంగా అన్నదానం





**ఎల్బీనగర్ సెప్టెంబర్ 22**

గణేష్ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా దుర్గా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 3,000 మందికి అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

## తెలంగాణ వార్రూమ్ నుంచి ఢిల్లీ వార్రూమ్కు..

# రుద్ర సంతోష్కు కీలక బాధ్యతలు





INDIAN NATIONAL CONGRESS

011-23019080
Phone : 011-23015015
Mobile : [redacted]
Website : www.inc.in

**ALL INDIA CONGRESS COMMITTEE**
**(OBC DEPARTMENT)**

**DR. ANIL JAIHIND**
Chairman

24, AKBAR ROAD,
NEW DELHI-110 011
19th September, 2026

**Appointment Notification**

In connection with the **"OBC Haq Ki Hoonkaar" 100-Day Campaign** being undertaken by the OBC Congress, All India Congress Committee (AICC), a **National War Room Committee** is hereby constituted to ensure coordination, monitoring, and necessary support for the effective implementation of the campaign across the country.

The following persons are hereby appointed as members of the **National War Room Committee** with immediate effect:

1. Shri Gowd Kiran Kumar
2. Shri Rudra Santhosh Kumar
3. Dr. Vikas Yadav
4. Ms. Deepti Battini

**హైదరాబాద్ సెప్టెంబర్ 22**

కాంగ్రెస్ జాతీయ నాయకులు రుద్ర సంతోష్కుమార్కు ఏఐసీసీ కీలక బాధ్యతలు అప్పగించింది. జాతీయ జనగణనలో కులగణన అంశంపై చేపట్టనున్న 100 రోజుల క్యాంపెయిన్కు ఏఐసీసీ వార్రూమ్ కోఆర్డినేటర్గా ఆయనను నియమించింది. ఈ మేరకు నియామకపత్రం జారీ చేసింది.

తెలంగాణలో కులగణన కార్యక్రమాన్ని వార్రూమ్, కాల్సెంటర్, డిజిటల్ మానిటరింగ్ వ్యవస్థల ద్వారా బూత్ స్థాయి వరకు సమన్వయం చేసిన అనుభవం రుద్ర సంతోష్కుమార్కు ఉంది. ఈ అనుభవాన్ని జాతీయ స్థాయిలో వినియోగిస్తూ 15 వారాల కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, డిజిటల్ మానిటరింగ్, వారపు పురోగతి నివేదికలపై దృష్టి సారించనున్నారు.ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు అధ్యక్షతన జరిగిన వర్క్షాప్లో ఏఐసీసీ ఓబీసీ జాతీయ చైర్మన్ అనిల్ జైహింద్ యాదవ్, ఏఐసీసీ మైనారిటీ జాతీయ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్గర్హి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో క్షేత్రస్థాయి సమన్వయ అనుభవానికి జాతీయ స్థాయిలో బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
23 సెప్టెంబర్ బుధవారం 2026

# గణనాథుని పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

కౌడిపల్లి హైదరాబాద్ ఎస్టేట్ సెప్టెంబర్ 22



మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కోటాల గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి పుష్పాలు, నైవేద్యాలు సమర్పించారు. ఎమ్మెల్యే రాకతో గ్రామంలో సందడి నెలకొంది. ఆలయ మండపం వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో మాట్లాడి గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ గురించి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి గ్రామ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణేష్ నవరాత్రి వేడుకలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, ఐకమత్యంతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు ప్రజల జీవితాల్లోని కష్టాలను తొలగించి, ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని గణనాథుడిని ప్రార్థించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు గ్రామాల్లో ప్రజల మధ్య భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ, ప్రతి ఒక్కరూ భక్తి భావంతో పాల్గొనాలని కోరారు. గ్రామంలో గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. కోటాల గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు సైతం ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుమలత రవి, పార్టీ అధ్యక్షులు గౌ రెడ్డి పద్మయ, బాకీ ఎల్లం, శ్రీనివాస్ రెడ్డి, కౌడిపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సార రామగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ బొడ్ల నవీన్ గుప్తా, ప్రవీణ్ కుమార్, రామాంజనేయులు, రవి సాగర్, పోల నవీన్, బర్ల శేఖర్, ఆలయ మండప నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాయి వర్షిణికి ఇనగాల ఆర్థిక సాయం

## - ఆసియా కప్‌కు ఎంపికైన క్రీడాకారిణికి రూ.10 వేల చేయూత

**హనుమకొండ, సెప్టెంబర్ 22, హైదరాబాద్ ఎస్టేట్:**



చైనాలోని వుక్సీలో అక్టోబర్ 12 నుంచి 18 వరకు జరిగే అండర్-15 మహిళల సాఫ్ట్‌బాల్ ఆసియా కప్-2026 పోటీలకు భారత జట్టు తరపున ఎంపికైన హనుమకొండకు చెందిన క్రీడాకారిణి వెల్పుల సాయి వర్షిణికి ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అందించారు. సాయి వర్షిణి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని కలిసి తమ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సాయి వర్షిణి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఆర్థిక ఇబ్బందులతో క్రీడాకారుల ప్రతిభకు ఆటంకం కలగకుండా ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు.

# శివశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

## గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరిగింది

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 21

రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం ఆర్కపల్లి గ్రామంలో ఘనంగా వినాయకుని పూజ కార్యక్రమంలో మురుపో జూ శ్రీనివాస్ చారి జర్నలిస్ట్ కృష్ణ చారి చంద్రశేఖర్ చారి కుటుంబ సమేతంగా పూజలో పాల్గొన్నారు అనంతరం వినాయకుని అన్న ప్రసాదము అందరికీ శివశక్తి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది ఈ కార్యక్రమంలో మురు పోజు లక్ష్మణాచారి ఐశ్వర్ చారి అరవింద్ చారి అ బి చారి ఊరి పెద్దలు చిన్నలు మహిళా తల్లులు పాల్గొన్నారు



# 46 ఏళ్ల తర్వాత.. కన్నీళ్లతో కలిసిన స్నేహాలు!

## జూకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 197980 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్**

జూకల్:

జూకల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 197980 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరగాని కృష్ణ అధ్యక్షతన అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గిరగాని కృష్ణ మాట్లాడుతూ 46 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా తాము చదువుకున్న పాఠశాలకు కుటుంబ సమేతంగా తరలివచ్చి, నాటి గురువులను సత్కరించుకోవడం, చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాలకు, ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా ఉందన్నారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఎలగొండ సంధ్యారాణి, ఉప సర్పంచ్ అమిర్ సోహేల్ హాజరయ్యారు.

46 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న బడిని చూసి, నాటి స్నేహితులను కలుసుకోవడంతో పూర్వ విద్యార్థులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పలువురి కళ్లల్లో ఆనందభాష్పాలు కనిపించాయి.

పూర్వ విద్యార్థులు తమ జీవిత భాగస్వాములతో కలిసి కార్యక్రమానికి హాజరై, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రాజయ్య, పగడాల అయిలయ్య, బండి రాజమౌళి, డి. రామ్‌మోహన్లను ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి గురువులకు పాదాభివందనాలు చేసి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఇంతటి సీనియర్ పూర్వ విద్యార్థులు తమ గురువులను ఈ విధంగా గౌరవించడం నేటి తరానికి ఆదర్శప్రాయమని పలువురు కొనియాడారు.

అదేవిధంగా పూర్వ విద్యార్థుల్లో ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించి పదవీ విరమణ పొందిన విరగంటి రవీందర్ను కూడా ఘనంగా సన్మానించారు.

పాఠశాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి

ఈ సందర్భంగా వెల్దండి రవీందర్ మాట్లాడుతూ పాఠశాల పరిశుభ్రతపై ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పాఠశాల పరిశుభ్రత, అవసరమైన సౌకర్యాల కోసం దాతల సహకారం తీసుకునేందుకు చర్యలు చేపడతామని ప్రధానోపాధ్యాయులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అలాగే జూకల్ గ్రామంలో చాలా సంవత్సరాలుగా బోదకాలు, ఫైలేరియా సమస్యలతో పలువురు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను డీఎంహెచ్ఓ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సర్పంచ్ ఎలగొండ సంధ్యారాణిని కోరారు. దీనిపై సర్పంచ్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జూకల్ నుంచి జాతీయ స్థాయికి మ్యాదరి సునీల్ సేవలు

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ చలగరిగే గ్రామానికి చెందిన గేయ రచయిత చంద్రబోస్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినట్లే, జూకల్ గ్రామానికి చెందిన కవి, రచయిత, గేయ రచయిత మ్యాదరి సునీల్ కూడా తన సాహిత్య రచనలతో గ్రామానికి మంచి పేరు తీసుకువస్తున్నారని కొనియాడారు. ఎన్నో గొప్ప పాటలు రాస్తూ సాహిత్య రంగంలో ముందుకు సాగుతున్నారని, అదే సమయంలో చేయూత సంస్థ ద్వారా నిరుపేదలకు సహాయం అందిస్తూ సామాజిక సేవలోనూ తనవంతు పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు.

ఈ సందర్భంగా మ్యాదరి సునీల్ మాట్లాడుతూ తన సాహిత్య రచనలు, సామాజిక సేవలను గుర్తించి గురు సమానులు, గ్రామ ప్రముఖుల సమక్షంలో సన్మానం పొందడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తనను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

గురువులను గౌరవించడం ఆదర్శనీయం: సర్పంచ్ సంధ్యారాణి

ముఖ్య అతిథి సర్పంచ్ ఎలగొండ సంధ్యారాణి మాట్లాడుతూ 46 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కుటుంబ సమేతంగా ఒకచోట చేరి తమ పాఠశాలను, గురువులను స్మరించుకోవడం అభినందనీయమన్నారు. గురువులను పూలమాలలతో సత్కరించి, పాదాభివందనం చేయడం వారి సంస్కారం, గురుభక్తికి నిదర్శనమన్నారు. ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు నేటి తరానికి మంచి సందేశాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధితో పాటు గ్రామ సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ అమిర్ సోహేల్, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





